క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఆత్మకమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

పూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నూతనంగా ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కక్కులూరి శ్రీనివాస్‌రెడ్డిని నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికి కూడా సంక్షేమ పథకాలు అందించిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రుణమాఫీ, రైతుభరోసా, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కాలువకు మరమ్మతులు చేయండి



పాటు కాలువను పరిశీలిస్తున్న రైతులు

కొడంగల్: కొడంగల్ పెద్ద చెరువులోకి వర్షం నీరు వెళ్లే పాటు కాలువకు మరమ్మతులు చేయాలని రైతులు కోరారు. పట్టణ శివారులో వేస్తున్న బైపాస్ రోడ్డు వల్ల పాటు కాలువ మూసుకొని పోయిందని వాపోయారు. ఉడిమేశ్వరం, ఎనికెపల్లి, ఎరన్‌పల్లి శివారు నుంచి వర్షం నీరు ఈ కాలువ ద్వారా కొడంగల్ చెరువుకు చేరుతుందన్నారు. బైపాస్ నిర్మాణంలో భాగంగా వేస్తున్న రోడ్డుతో కాలువ పూడుకుపోయిందన్నారు. చెరువులో నీరు లేకపోతే ముదిరాజు కులస్తులకు చేపలు పెంచే అవకాశం లేకుండా పోతుందన్నారు. అధికారులు స్పందించి పాటు కాల్వ పక్క నుంచి రోడ్డు వేయాలని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మధుయాదవ్, రైతులు బండి గోపాల్, బాలయ్య, పాశం వెంకటయ్య తదితరులు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

దుద్యాల్: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఎస్ఐ యాదగిరి వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. అటుగా వెళ్లే వాహనాలను నిలిపి సరైన నంబర్ ప్లేట్‌లు లేని పలు బైకులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రయాణాలు ప్రారంభించే ముందు వాహనాలకు అన్ని రకాల పత్రాలు ఉన్నాయా లేవా అనే విషయాన్ని తప్పకుండా పరిశీలించుకోవాలన్నారు. మండలంలో నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడి నియామకం



ప్రధాన కూడలిలో నర్సింలుగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గండ్వీడ్ నర్సింలుగౌడ్ ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం స్థానిక ప్రధాన కూడలిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికకావడం అభినందనీయమన్నారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో రాంచంద్రారెడ్డి, సంగాయిపల్లి నర్సింలు, వీరేశలింగం, రాములు, హాజీ మలంగ్‌బాబా, కలీమ్, మైనోద్దీన్, కృష్ణ, రవిగౌడ్, కాశప్ప, మతీన్, కొత్తూరుకు చెందిన ప్రవీణ్, మహేందర్ తదితరులున్నారు.

ఫిజియోథెరపీ శిబిరం

బొంరాస్‌పేట: ఫిజియోథెరపీపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉంటే తమ పిల్లల్ని వైకల్యం నుంచి దూరం చేయవచ్చని ఐఈఆర్‌పీ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. కొన్ని రకాల శారీరక దివ్యాంగులైన పిల్లలకు ఫిజియోథెరపీ చేయిస్తే వికలత్వం తొలగిపోయి సాధారణంగా ఉంటారని అన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలన్నారు.

ఇక పక్కాగా హాజరు

- ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నిషన్ షురూ
- రోజుకు రెండు సార్లు అటెండెన్స్ వేయాల్సిందే

దౌల్తాబాద్: ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరు ఫేస్ రికగ్నిషన్ హాజరు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 1 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్ ద్వారా హాజరు వేస్తున్నారు. ఇప్పటికే రెండేళ్ల నుంచి ఉపాధ్యాయులు ట్యాబ్‌లు, మొబైల్ ద్వారా విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నారు. మండలంలో మొత్తం 158 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇప్పటి వరకు 130 వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కొందరు విధులకు డుమ్మా కొడుతూ సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని ఫిర్యాదుల నేపథ్యంలో విద్యాశాఖ ముఖ గుర్తింపు హాజరుకు శ్రీకారం చుట్టింది.

మార్పు వచ్చేనా?

ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న కొందరు టీచర్లతో చెడ్డ పేరు వస్తుందని విద్యాశాఖ భావిస్తుంది. రూ.వేలల్లో వేతనాలు పొందుతూ అనాధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నారు. మరికొందరు రిజిస్టర్‌లో సంతకాలు చేసిన తర్వాత సొంత పనులకు వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో పనిచేస్తున్న వారైతే ఒప్పందం ప్రకారం ఒకరు విధులకు వెళ్లి మరొకరు డుమ్మా కొట్టడం వంటి సంఘటనలు వెలుగు చూశారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అమలు చేస్తున్న ఫేస్ రికగ్నిషన్ హాజరుతో మార్పు వస్తుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.



బాలంపేట పాఠశాలలో యాప్‌లో హాజరు వేసుకుంటున్న టీచర్లు

> **అనాధికార గైర్హాజరుకు చెక్**
>
> ఉపాధ్యాయులు తప్పనిసరిగా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ముఖ గుర్తింపు హాజరుతో ఉపాధ్యాయుల అటెండెన్స్ పెరిగి విద్యా ప్రమాణాలు మెరుగు అవుతాయి. టీచర్ల అనాధికార గైర్హాజరుకు అవకాశం ఉండదు.
>
> – వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

రోజుకు రెండుసార్లు

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించేందుకు ప్రభుత్వం రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తుంది. కొంతమంది ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరవుతూ సొంత పనులు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఫేస్ రికగ్నిషన్ ద్వారా ఉదయం 9గంటలకు పాఠశాల ఆవరణలోనే యాప్‌లో నమోదు చేయాలి. మళ్లీ సాయంత్రం 4 గంటలకు స్కూల్ ముగింపు సమయంలో హాజరు వేయాలి. నిర్ణీత సమయానికి తప్పనిసరిగా పాఠశాలలోనే యాప్‌ను ఆన్ చేసి లొకేషన్ ద్వారా హాజరు వేయాల్సి ఉంటుంది.

కంకర వేశారు.. తారు మరిచారు



తాండూరు-వికారాబాద్ రోడ్డుపై దుమ్ము లేపుతున్న వాహనాలు

తాండూరు టౌన్: ఆర్భాటంగా రోడ్డు వేస్తామంటూ చెప్పి, కంకర మాత్రం వేసి తారు వేయడం మరిచారు. దీంతో ఆ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ పరిస్థితి గత నాలుగు నెలలుగా తాండూరు-వికారాబాద్ రోడ్డు మార్గంలో కనిపిస్తోంది. ఈ రోడ్డుపై వందలాది వాహనాలు పరుగులు తీస్తుంటాయి. భారీ వాహనాలు వెళ్లే సమయంలో కంకర రాళ్లు పైకి లేచి వాహనాల అద్దాలు పగిలిపోవడం లేదా బైకులపై వెళ్తున్న జనాలకు తగులుతున్నాయి. అంతే కాకుండా విపరీతమైన దుమ్ము లేవడంతో ముందు వెళ్తున్న, ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడటం లేదు. తాండూరు- వికారాబాద్ రోడ్డు మార్గాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో మదనంతాపూర్ వద్ద స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి రోడ్డు పనులను ప్రారంభించారు. గుంతలు పడిన చోట మరమ్మతు చేయడంతో పాటు నూతన తారు రోడ్డు నిర్మించాలనుకున్నారు. అయితే అట్టి పనులు ఏమాత్రం ముందుకు కొనసాగడం లేదు. దీంతో ఏళ్ల తరబడిగా అనుభవిస్తున్న రోడ్డు కష్టాలు తాండూరు ప్రజలకు మళ్లీ పునరావృతమవుతున్నాయి. అధికారులు స్పందించి తాత్కాలికంగానైనా తారు రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు కరెంటు కష్టాలు!



గోవిందరావుపేట ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపాటు

యాలాల: పంటల సాగు కోసం పొలాల్లో కరిగేట్లు చేసుకుంటున్న సమయంలో కరెంటు సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు యాలాల, గోవిందరావుపేట రైతులు పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం గోవిందరావుపేట శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కరెంటు విషయమై స్థానిక ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని మండిపడ్డారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం ఆయిల్ లీకేజీతో కాలిపోయింది. దీంతో స్థానిక రైతులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారమిచ్చారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో, రైతులే మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొని ఏడీ కార్యాలయానికి తరలించి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

నిర్లక్ష్య వైఖరి

కొత్తగా ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుండటంతో మరోమారు ఫిర్యాదు చేశారు. అయినా వారి నుంచి స్పందన లేకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న లైన్‌మెన్ హరిప్రసాద్, తన సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికీ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండుసార్లు కరిగేట్లు చేసుకున్నామని, కూలీల డబ్బులు, ట్రాక్టర్ల ఖర్చు తడిసి మోపెడవుతున్న సమయంలో ట్రాన్స్‌కో సిబ్బంది కరెంటు పునరుద్ధరణ విషయంలో నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. ఈ విషయమై లైన్‌మెన్ హరిప్రసాద్‌ను వివరణ కోరగా.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో జాప్యం జరిగిందని, విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించానని చెప్పారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

బషీరాబాద్: మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తాండూరు ట్రాన్స్‌కో డీఈ భానుప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు బషీరాబాద్ మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు అన్నాసాగర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని అన్నాసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ నిర్వహిస్తామని వ్యవసాయ విస్తీర్ణ అధికారి సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతో పాటు, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ ఫోన్ వెంట తీసుకురావాల్సిందిగా ఆయన సూచించారు. ఉదయం 9 గంటలకే గ్రామ పంచాయతీ వద్దకు చేరుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

క్షయ వ్యాధిని తరిమేద్దాం

దౌల్తాబాద్: మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్షయ నివారణపై ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి ప్రియదర్శిని పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ నివారణకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వ్యాధి బారిన పడిన వారికి ఉచితంగా వైద్య చికిత్స అందిస్తారన్నారు. ఇందులో 182 మందికి పరీక్షలు నిర్వహించగా 22 మందికి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రఫీ, ఎంఎల్‌పీహెచ్‌పీ మంజుల, మాధవి, ఏఎన్ఎం మంగమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో కొత్తగా వచ్చిన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డులను పంపిణీ చేసిందన్నారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నాగవర్ధన్, రేషన్ డీలర్ పెంటయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

సమాఖ్య అభివృద్ధికి కృషి

బంట్వారం: మండల సమాఖ్య అభివృద్ధికి బదిలీపై వెళ్లిన ఏపీఎం దేవయ్య ఎనలేని కృషి చేశారని మండల సమాఖ్య అధ్యక్షురాలు భ్రమరాంబ అన్నారు. మంగళవారం సమాఖ్య కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ రీత్యా బదిలీలు సహజమేనన్నారు. అయినప్పటికీ వారు చేసిన మంచి పనులే గుర్తుండిపోతాయన్నారు. ఎక్కడైన సరే విధుల్లో నిబద్ధత అంకితభావంతో పని చేస్తేనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం బదిలీపై నవాబుపేటకు వెళ్లిన దేవయ్యతో పాటు, తాండూరు నుంచి బంట్వారంకు వచ్చిన ఆనందన్ మర్యాద పూర్వకంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, సమాఖ్య కార్యదర్శి కంసమ్మ, కోశాధికారి వీరమణి, సీసీలు ప్రకాష్‌గౌడ్, నర్సింలు పాల్గొన్నారు.



సన్మాన సమావేశంలో సమాఖ్య సభ్యులు, అధికారులు

తపస్ సభ్యత్వ నమోదు

బొంరాస్‌పేట: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని చౌదర్‌పల్లి తదితర పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సభ్యత్వం చేయించారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల పోరాడటానికి అండగా ఉంటుందని ఆ సంఘం నాయకులన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల కరువు భత్యం, పీఆర్సీ నివేదిక అమలు, జెడ్పీజీపీఎఫ్ బకాయిలు, మెడికల్ బిల్స్, పదోన్నతుల అమలు పట్ల సంఘం పోరుడుతుందని చెప్పారు. దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ భావాలు కలిగి ఉన్న ఉపాధ్యాయ సంఘంగా తమకు మంచి స్పందన రావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి మల్లయ్య, గౌరవ అధ్యక్షురాలు శ్రీప్రియ, పరమేశ్వరి, సభ్యులు మహేశ్, ప్రశాంత్, లావణ్య, శ్రీలత, భాను, సుధ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో సంఘం నాయకులు

ఒగ్గుడోలు కళాకారులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఒగ్గు శివ

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాందార్‌పూర్‌కు చెందిన ఒగ్గుడోలు కళాకారులను అవార్డులు వరిస్తున్నాయి. గ్రామానికి చెందిన ఒగ్గు బీరు నేతృత్వంలో ఉన్న శ్రీమల్లికార్జున ఒగ్గుడోలు కళాబృందం ఐదేళ్లుగా వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సంస్కృ తి కళానికేతన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో ఒగ్గు బీరు ×అఖండ భారత కళారత్న అవార్డు 2025₹ అలాగే బృందంలోని సభ్యుడు ఒగ్గు శివ ×పద్యజ్యోతి వార్డు 2025₹ అందుకున్నారు. తెలంగాణ జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ మాస్టర్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, గౌరవాధ్యక్షుడు అంజిలప్ప అభినందనలు తెలిపారు. ఇందులో మామిడి హరికృష్ణ, సీనియర్ కళాకారుడు ఒగ్గురవి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం రిపోర్టు బోగస్

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక బోగస్ అని బీఆర్ఎస్ తాండూరు మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం గౌతపూర్ చెక్‌పోస్ట్ వద్ద కార్యకర్తలతో కలిసి కాళేశ్వరం కమిషన్ రిపోర్టుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. కమిషన్ పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు పన్నాగాలు చేస్తోందన్నారు. రిపోర్టులో అన్ని అబద్ధాలు, అవాస్తవాలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు ఎంతగానో మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌడి వెంకటేశం, హేమంత్‌కుమార్, సుధాకర్‌గౌడ్, రాములు, నాగార్జున, మొగులప్ప, శేఖర్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గౌతపూర్ చెక్‌పోస్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

తాండూరు: కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోన్ చేసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గౌతపూర్‌లో..

తాండూరు రూరల్: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు మండలంలోని గౌతపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యకర్తలకు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు.

రోగులకు పండ్ల పంపిణీ

పూడూరు: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఎలాంటి రోగాలు దరి చేరవని యువజన నాయకుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పూడూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకున్నప్పుడే అభివృద్ధి చెందుతారని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యురాలు దేవిక, నాయకులు గంగాధర్‌గౌడ్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: పార్టీ కార్యాలయంలో కేక్ తినిపించుకుంటున్న నాయకులు

మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు

దోమ: ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల ఏర్పాట్లకు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్ చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని ఐనాపూర్ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఏఈ రవితో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. మరుగుదొడ్లు, టాయిలెట్స్ లేని పాఠశాలలో నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రూ.లక్షతో ఐనాపూర్ పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మిస్తున్నామని, త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబుచాంద్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

వయోజన విద్యను ప్రోత్సహించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గ్యామా

దోమ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన విద్యను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని ఎంపీడీఓ గ్యామా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఎం శోభ, ఎంఈఓ వెంకట్‌తో కలిసి వీఓఏలు, సీఆర్‌పీలకు ఉల్లాస్ అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య అవకాశం కోల్పోయి 15 సంవత్సరాలు నిరక్షరాసులు ఉన్నట్లయితే, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత, ప్రాథమిక విద్యతో పాటు డిజిటల్ అక్షరాస్యతను అందించవచ్చాన్నారు. ఆసక్తి కలిగిన వారికి చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

సంక్షేమ హాస్టల్‌ను ప్రారంభించాలి



తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తహసీల్దార్ కృష్ణయ్యకు ఏబీవీపీ నాయకుల వినతి

చేవెళ్ల: బాలికలకు చేవెళ్లలో సంక్షేమ హాస్టల్ లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే హాస్టల్ ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ మాట్లాడుతూ.. కళాశాలల్లో చదువుకునే బాలికలకు అందుబాటులో సంక్షేమ హాస్టల్ లేని కారణంగా చదువుకు దూరం అవుతున్నారన్నారు. గతంలోనే చేవెళ్లకు బాలికల సంక్షేమ హాస్టల్ మంజూరైన కొన్ని రోజులు అద్దె భవనంలో కొనసాగించి.. అ తర్వాత పాఠశాల వసతి గృహంలో కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కళాశాల విద్యార్థులకు సరైన వసతి సౌకర్యం లేకపోవటంతో అడ్మిషన్లు కూడా చేసుకోలేదన్నారు. దీంతో విద్యార్థులు కళాశాలల్లో చదువుకునేందుకు ఇళ్ల నుంచి రావాల్సి వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చేవెళ్లకు మంజూరైనా సంక్షేమ హాస్టల్‌ను వెంటనే ప్రారంభించి నూతన భవనం నిర్మించాలని కోరారు. ప్రస్తుతం అద్దె భవనంలో అయినా విద్యార్థులకు వసతి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్, మల్లేశ్, మరికృష్ణ, ఆకాశ్, వెంకటేశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కుల్కచర్ల: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి కిరణ్‌గౌడ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులపై ఆశావర్కర్లు, ఆరోగ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అపరిశుభ్ర పరిసరాలతో కలిగే వ్యాధుల గురించి సూచించాలన్నారు. గ్రామాల్లో నిత్యం పర్యటించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి